సాక్షి
వికారాబాద్
గురువారం ⋅ 23 ⋅ ఫిబ్రవరి ⋅ 2023



ఆన్‌లైన్‌లోనే 'ఉపాధి' హాజరు
జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపట్టింది. 8లో▸



అవగాహన కల్పించండి
రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల నివారణకు పోలీసులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. 8లో▸



సాగు ఘనం..
చెరుకు సాగు క్రమంగా పెరుగుతోంది. పంటకు అనువైన నేలలు ఉండటంతో చెరుకు సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

టెంకాయల విక్రయాలకు వేలంపాట



పాంబండ దేవాలయంలో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

కుల్కచర్ల: పాంబండ ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నట్లు దేవస్థానం ఆలయ చైర్మన్ రాములు, ఈఓ సుధాకర్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ దేవాలయం వద్ద టెంకాయలు, తలనీలాల వేలం పాటలను నిర్వహించారు. ఉగాది సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలలో టెంకాయలు అమ్ముకునేందుకు రూ.5 లక్షల 51వేలకు కుర్వ వెంకటయ్య అనే వ్యక్తి దక్కించుకున్నారు. బ్రహ్మోత్సవాలతో పాటు సంవత్సర కాలానికి గానూ తలనీలాల వేలం పాటను రూ. 2లక్షల 44వేలకు అంగులురు పోలేరు అనే వ్యక్తి సొంతం చేసుకున్నారు. ఏడాదిపాటు టెంకాయలు అమ్ముకునేందుకుగాను రూ. 5లక్షల 42వేలకు శివప్రసాద్ అనే వ్యక్తి హక్కులను పొందారు. కార్యక్రమంలో తాండురు భద్రేశ్వర స్వామి ఆలయ ఈఓ శేఖర్ గౌడ్, ఆలయ పాలకవర్గ సభ్యులు సంజీవ్, లక్ష్మయ్య, ఆలయ అర్చకులు పాండు శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు సేవలు మరింత చేరువ

డీసీసీబీ జిల్లా సీఈఓ శ్రీనివాస్



మండల పరిషత్ ఆవరణలో స్థల పరిశీలన చేస్తున్న డీసీసీబీ అధికారులు

మోమిన్‌పేట: ఖాతాదారులకు సేవలు మరింత చేరువ చేసేందుకు నూతన బ్యాంకు భవన నిర్మాణం చేపట్టనున్నట్లు డీసీసీబీ జిల్లా సీఈఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతన బ్యాంకు భవన నిర్మాణం చేపట్టేందుకు స్థల పరిశీలన చేశారు. నాబార్డు ద్వారా బ్యాంకు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. స్థలం అప్పగించిన వెంటనే భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. మోమిన్‌పేట పీఏసీఎస్ నూతన భవనం, గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపనచేశామన్నారు.అదే విధంగా డీసీసీబీ నూతన భవన నిర్మాణ పనులు చేపట్టామన్నారు. స్వల్పకాల రుణాల వడ్డీలను వసూలు చేయాలన్నారు. దీర్ఘకాలిక రుణ వాయిదా బకాయిలను క్రమం తప్పకుండా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించా రు.ఆయన వెంట డీసీసీబీ, నాబార్డు అధికారులు,తహసీల్దార్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో ముగ్గురిపై పోక్సో కేసు

కుల్కచర్ల: బాలికను అపహరించిన ఘటనలో ముగ్గురిపై పోక్సో కేసులు నమోదయ్యాయి. ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ఇప్పాయిపల్లికి చెందిన బాలిక(17)ను ఈ నెల 20న రాంపూర్‌కు చెందిన షేక్ సర్వర్ అనే యువకుడు ప్రేమ పేరుతో అమ్మాయిని అపహరించాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. కిడ్నాప్ చేసింది షేక్ సర్వర్ అని ఫిర్యాదు చేశారు. విచారణను చేపట్టిన పోలీసులు బుధవారం బాలికను అపహరించిన షేక్ సర్వర్‌ను, అతనికి సహకరించిన నంచర్ల మల్లేశ్, నూకపోతు మల్లేశ్‌లను పట్టుకుని వారిపై పోక్సో కేసు నమోదు చేశారు. నిందితులను పరిగి సబ్ జైలుకు రిమాండ్ చేశారు. బాలికను సఖి సెంటర్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

మరో మూడు నామినేషన్లు

సాక్షి, సిటీబ్యూరో: మహబూబ్‌నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి బుధవారం ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. లింగిడి వెంకటేశ్వర్లు, ఎస్.విజయ్‌కుమార్, కాంటే సాయన్నలు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలాకు అందజేశారు. హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.

ప్రచారంలో బిజీ..

హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జేఎస్టీయూ మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వినయ్ బాబును మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాల్లో ప్రచారం నిర్వహించారు.

అడవులకు ఆపద

మానవ మనుగడకు ఆధారమైన అడవులకు రక్షణ కరువైంది. అడవుల ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అటవీ భూములు కబ్జా చేస్తున్న రియల్టర్లు, క్వారీల నిర్వాహకులు, రిసార్ట్స్‌ల యజమానులు యథేచ్ఛగా తమ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. అక్రమాలకు అడ్డుకట్టవేసేందుకు యత్నించిన అధికారులకు బదిలీవేటు పడుతుండటం గమనార్హం. అక్రమార్కులతో ప్రజాప్రతినిధులు సైతం కుమ్మక్కై దోపిడీలో భాగస్వాములవుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

యథేచ్ఛగా భూముల ఆక్రమణ

- జోరుగా వ్యాపారకార్యకలాపాలు
- అక్రమార్కులతో పాలకుల కుమ్మక్కు
- నానాటికీ తగ్గిపోతున్న అటవీ ప్రాంతం
- జిల్లాలో అటవీ విస్తీర్ణం 1,08000 ఎకరాలు



జిల్లాలో దట్టమైన అడవీ ప్రాంతం

వికారాబాద్: జిల్లాలో మొత్తం 1,08,000 ఎకరాల అటవీ భూములు ఉన్నాయి. అందులో ప్రస్తుతం అటవీ శాఖ అధికారుల లెక్కల ప్రకారం 25 శాతానికి పైగా అంటే సుమారు 31 వేల ఎకరాల భూములు ఆక్రమణకు గురయ్యాయి. 94 ఫారెస్టు బ్లాకులు ఉండగా అందులోని కొన్ని బ్లాక్‌లలో ఉన్న ఏరియా కబ్జా కోరల్లోకి వెళ్లి పోయింది. మరికొన్ని చోట్ల 50 శాతం నుంచి 90 శాతం వరకు అటవీ ప్రాంతం కబ్జాలకు గురయ్యిందంటే ఆక్రమణలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది. అటవీ భూములు గతంలో పోడు రూపంలో వ్యవసాయం కోసమే కబ్జా చేసే వారు. ప్రస్తుతం వ్యాపారం కోసం కబ్జాలకు పాల్పడుతున్నారు. రక్షించాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తుండటంతో జిల్లాలో అడవులకు రక్షణ లేకుండా పోయింది.

జిల్లాలో అటవీ భూములు

జిల్లా భౌగోళికంగా 13 శాతం అటవీ భూములు ఉన్నాయి. ఇందులో 9 శాతం గ్రీనరీ అంటే 15 వేల ఎకరాల్లో దట్టమైన అడవులున్నాయి. మనకు చుట్టుపక్కల జిల్లాల్లో ఇదే అత్యధిక శాతం కావటం గమనార్హం. ఈ ప్రాంతాన్ని ఐదు క్లస్టర్లుగా 94 బ్లాకులుగా విభజించారు. ఇందులో అనంతగిరి ప్రాంత అడవి ముఖ్యమైనదిగా చెబుతారు. కుల్కచర్ల, చించోలి ప్రాంత అడవిలో చిరుతల సంచారం ఉంది. అనంతగిరిలో హైనాలు, దుప్పులు, దున్నలు, కొండగొర్రెలు, తదితర జంతు జాతులు ఉన్నట్టు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఓ పక్క ప్రభుత్వం అటవీ విస్తీర్ణం పెంచేందుకు హరితహారం లాంటి కార్యక్రమాలు తీసుకుని అమలు చేస్తుండగా మరో పక్క కబ్జాకోరుల కారణంగా రోజు రోజుకు అటవీ విస్తీర్ణం తగ్గిపోతోంది. దీంతో అడవిలో జీవిస్తున్న వన్యప్రాణుల జీవనానికి అటంకాలు ఏర్పడుతున్నాయి. పూర్తి స్థాయిలో అటవీభూముల సర్వే నిర్వహించి పక్కగా హద్దులు ఏర్పాటు చేస్తే తప్ప అడవులను కాపాడటం కష్టమని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇదే విషయం ఎన్నో సార్లు ప్రభుత్వానికి లేఖలు రాశామని వారు తెలిపారు.

కఠినంగా వ్యవహరించిన అధికారిపై బదిలీవేటు

ఇటీవలి వరకు జిల్లాలో విధులు నిర్వహిస్తూ కబ్జాకోరుల విషయంలో కఠినంగా వ్యవహరించిన డీఎఫ్ఓ వెంకటేశ్వర్‌రెడ్డి ఐదు నెలల తిరక్కుండానే బదిలీచేశారు. వికారాబాద్ రేంజ్‌లోని అటవీ భూముల్లో రెండు క్వారీలు నిర్వహిస్తూ ఒకచోట రూ.160 కోట్లు, మరో చోట 60 కోట్ల విలువైన ఖనిజాన్ని అక్రమంగా తవ్వి తరలించారని తేల్చడంతో పాటు కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. దుద్యాల ఫారెస్టు పరిధిలోని ఓ క్వారీ సైతం అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారని నోటీసులు జారీ చేశారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పది సా మిల్లులు సీజ్ చేశారు. అక్రమంగా కలప వినియోగిస్తున్న ఓ ప్లై ఉడ్ కంపెనీకి రూ. ఐదు లక్షల జరిమానా విధించారు. అనంతగిరి సమీపంలో ఫారెస్టు భూమిని ఆక్రమించిన ఓ రిసార్ట్స్‌కి నోటీసులు ఇవ్వటంతో పాటు కోర్టులో కౌంటర్ వేశారు. పూడూరు మండలం దామగుండం సమీపంలో ఓ రిసార్ట్స్ ఫారెస్టు భూమిలో ఏర్పాటు చేయగా వారికి నోటీసులు ఇవ్వటంతో పాటు కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. ఐదు నెలల కాలంలోనే ఓ అధికారి ఇదంతా చేయటంతో అక్రమార్కుల ఆటలు సాగక క్వారీల యజమానులు, ప్రజా ప్రతినిధులు కుమ్మక్కై ఆయన్ను బదిలీపై పంపించి వారి పంతం నెగ్గించుకున్నారన్న ప్రచారం జరిగింది. దీంతో వారి అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.



మురళీకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్

ఇదెక్కడి దాడుల సంస్కృతి

- మురళీకృష్ణ ఇంటిపై దాడిచేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి
- ముమ్మాటికీ పోలీసుల వైఫల్యమే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్ డిమాండ్

తాండూరు: రాష్ట్రంలో గూండాల రాజ్యం నడుస్తోందని, ఇళ్లపైకి వెళ్లి దాడులకు తెగబడుతున్నారని, బీజేపీ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు మురళీకృష్ణ ఇంటిపై దాడులు చేయడమేనని ఇందుకు సాక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్ ఆరోపించారు. రాష్ట్రంలో పోలీసు శాఖ పూర్తిగా అచేతనంగా మారిందని ఆయన అన్నారు. బుధవారం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షకార్యదర్శులు సదానంద రెడ్డి, యు.రమేశ్‌కుమార్, నాయకులతో కలిసి ఆయన మురళీకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. అర్ధరాత్రివేళ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తన అనుచరులతో దాడి చేయించారని బండి సంజయ్ ఎదుట మురళీకృష్ణ కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. అనంతరం బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయ పార్టీ నాయకుల ఇళ్లపైకి వెళ్లి దాడులు చేయించడం ఇదెక్కడి సంస్కృతి అని ప్రశ్నించారు. మరోవైపు మురళీకృష్ణపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. గూండాలు ఇంటిపైకి వెళ్లి దాడులు చేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం దారుణమన్నారు. ఇంట్లో ఉన్న వృద్ధులను పిల్లలను చంపే ప్రయత్నం చేశారన్నారు. ఇది ముమ్మాటికీ పోలీసు అధికారుల వైఫల్యమేనని అన్నారు. హత్యలకు, అత్యాచారాలకు, భూ కబ్జాలకు, డ్రగ్స్ లాంటి వాటికి రాష్ట్రం కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. దాడిపై పోలీసులకు ముందే తెలిసిన భద్రత కల్పించలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్‌రెడ్డి, అధికార ప్రతినిధులు ఎన్వి సుభాష్, వీరేందర్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాన్వాయ్‌ను అడ్డుకున్న పోలీసులు



పూడూరు: తాండూరుకు వెళ్తున్న బండి సంజయ్ కాన్వాయ్‌ను అంగడి చిట్టంపల్లి గేటు వద్ద చన్గోముల్ పోలీసులు అడ్డుకున్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్‌ను పరామర్శించేందుకు వెళ్తున్న బండి సంజయ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఈ విషయమై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో చేసేదేమిలేక కాన్వాయ్‌ను వదిలిపెట్టారు.

నేటి నుంచే యాప్ ద్వారా హాజరు

- దీని ఆధారంగానే జీతభత్యాలు
- అందరూ డౌన్‌లోడ్ చేసుకోండి
- అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం

వికారాబాద్ అర్బన్: జియో అటెండెన్స్ యాప్‌ను ప్రభుత్వ ఉద్యోగులందరూ డౌన్ లోడ్ చేసుకొని గురువారం నుంచి హాజరును నమోదు చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నీ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ అటెండెన్స్ యాప్ ను పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. దీని ఆధారంగానే సిబ్బందికి జీత భత్యాలు అందిస్తామని తెలిపారు. జిల్లాలో చాలా మంది సిబ్బంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోలేదని తెలిపారు. వారందరూ వెంటనే డౌన్ లోడ్ చేసుకునే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎన్నికల నోడల్ ఆఫీసర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ ఐడీ కార్డులను వెంటనే అప్‌డేట్ చేయాలని సూచించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వారీగా ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల ఓటర్ల వివరాలను తెలియజేయాలని ఆదేశించారు. జిల్లాలో 18 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.



డీపీఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

దత్తత తీసుకున్నామనే ఆలోచన రావద్దు..

పిల్లలను దత్తత తీసుకున్నామనే ఆలోచన రావద్దని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. వికారాబాద్ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆరుగురు చిన్నారులను నలుగురు దంపతులకు కలెక్టర్ చేతుల మీదుగా దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒక సారి దత్తత తీసుకున్న వారి ఇళ్లను సందర్శించి పిల్లల బాగోగులను చూసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారిని ఆదేశించారు.

ప్రతి కార్యాలయం దేవాలయమే..

కార్యాలయాలను దేవాలయాలుగా భావించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో జిల్లా పంచాయతీరాజ్ అధికారి కార్యాలయాన్ని డీపీఓ తరుణ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు ప్రతి రోజు ఇంట్లో కంటే ఎక్కువ సమయాన్ని కార్యాలయాల్లో గడుపుతారని, కనుక మన ఇంటిలా భావించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్ పరిసరాల్లో చేపడుతున్న పరిశుభ్రతను కలెక్టర్ పరిశీలించారు.



కుక్కిందలో ఊరడమ్మ దేవత ఆలయం వద్ద భక్తజనం

ఊరడమ్మకు బోనాలు

ధారూరు మండలంలోని కుక్కింద గ్రామంలో బుధవారం ఊరడమ్మ, గ్రామ దేవతల జాతర వైభవంగా జరిగింది. మూడు రోజులుగా గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు. బుధవారం మహిళలు బోనాలతో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు. మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా చల్లంగా చూడాలంటూ అమ్మవార్లకు వేడుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పి. బసప్ప, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

– ధారూరు

'పది'పై ప్రత్యేక దృష్టి

- వంద శాతం ఫలితాలే లక్ష్యం కావాలి
- ఆ దిశగా విద్యాబోధన సాగాలి
- ఉపాధ్యాయులకు డీఈఓ రేణుకాదేవి ఆదేశం

కుల్కచర్ల: పదో తరగతి విద్యార్థులందరూ మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికాయుతంగా విద్యాబోధన కొనసాగించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. టెన్త్ విద్యార్థులందరూ వందశాతం ఉత్తీర్ణతను సాధించాలన్నారు. అందుకు ప్రణాళికాయుతంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు దీర్ఘకాలికంగా గుర్తుంచుకునేలా అవగాహన కల్పిస్తూ బోధన అందించాలన్నారు. పరీక్షల సమయంలో టీవీలకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రత్యేక శ్రద్ధతో చదువుకోవాలని అన్నారు. జీవితంలో పదో తరగతి అనేది అత్యంతకీలకమైనదని అన్నారు. ప్రాథమిక తరగతులకు చెందిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధచూపాలన్నారు. ముఖ్యంగా చదవడం, రాయడం, గుణింతాలు చేయడం వంటి ప్రాథమిక అంశాలపై పట్టును సాధించేలా చూడాలని అన్నారు.కార్యక్రమంలో ఎంఈఓ హబీబ్ అహ్మద్, జెడ్పీ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, కస్తూర్బా గాంధీ ప్రత్యేకాధికారి దేవి, సీఆర్పీ కృష్ణ, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రేణుకాదేవి

డయాలసిస్.. ఇక అంతేనా?

- నేటికీ అందుబాటులోకి రాని రక్తశుద్ధి కేంద్రం
- పెద్దాస్పత్రిలో పేదోళ్ల కష్టాలు
- 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేసినా అందని సేవలు

కొడంగల్: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు వైద్య సేవలు అరకొరగానే అందుతున్నాయి. పేరుకు మాత్రమే పెద్దాస్పత్రి. పేదోళ్లకు కష్టాలకు తప్పడంలేదు. డయాలసిస్ కేంద్రం ప్రారంభించి 8 నెలలు అవుతున్నా నేటికీ అందుబాటులోకి రాలేదు. గతంలో జిల్లా వైద్యాధికారి ఆధీనంలో 30 పడకల ఆస్పత్రిగా ఉండేది. ప్రభుత్వం 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేసి అధునాతన భవనం నిర్మించారు. అయినా అందులో రోగులకు అవసరమైన సేవలు అందించడంలో అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ఏడాది జూన్ 16వ తేదిన రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆరు మిషన్లతో రక్త శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటించారు. మంత్రి చేతుల మీదుగా ప్రారంభించిన డయాలసిస్ కేంద్రం 8 నెలలు అవుతున్నా నేటికీ రోగులకు అందుబాటులోకి రాలేదు. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లోని కిడ్నీ రోగులు రెండు రోజులకు ఒకసారి రక్తాన్ని శుద్ధి చేయించుకోవాలి. కొడంగల్‌లో రక్తశుద్ధి కేంద్రం అందుబాటులోకి వస్తే తమకు మేలు జరుగుతుందని భావించారు. తాండూరు, మహబూబ్‌నగర్‌కు వెళ్లి డయాలసిస్ చేయించుకోలేక బాధితులు ఇబ్బంది పడుతున్నారు. ఆరు మిషన్లను మంజూరు చేసినట్లు అధికార యంత్రాంగం చెబుతున్నప్పటికీ కేంద్రంలో ఒక్క మిషన్ కూడా లేదు. బిగించిన వాటిని తిరిగి తీసుకెళ్లిపోయారు. కొత్తగా టెండర్లు అయినట్లు కొత్త మిషన్లు వస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. ఈనెలాఖరు వరకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అయితే 8 నెలలుగా రాని మిషన్లు ఈ నెలాఖరు వరకు వస్తాయంటే నమ్మశక్యంగా లేదని కిడ్నీ బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కొడంగల్‌లో ఉన్న డయాలసిస్ కేంద్రం



ఖాళీగా ఉన్న బెడ్లు

టెక్నీషియన్ల నియామకం జరిగేనా

డయాలసిస్ మిషన్లు నడిపించడానికి సిబ్బంది కావాలి. పర్యవేక్షణకు వైద్యులు అవసరం. ఇప్పటి వరకు సిబ్బందిని కూడా నియమించలేదు. ప్రతి రోజు 30 మంది డయాలసీస్ రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లి రక్త శుద్ధి చేయించుకుంటున్నారు. ఇందుకు మూడు వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. రోగి వెనుక ఒకరిని తీసుకెళ్లాల్సి ఉంటుంది. అన్ని ఖర్చులు కలుపుకొని సుమారు రూ.4వేల వరకు అవుతుందని బాధితులు చెబుతున్నారు. ఈ విషయంపై సంబంధిత సిబ్బందిని వివరణ కోరగా త్వరలో మిషన్లు వస్తాయని చెప్పారు. మిషన్లు వచ్చిన తర్వాత రక్తశుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తామని అన్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొడంగల్ రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. బుధవారం తెల్లవారుజామున మోత్కులబండ తండా నుంచి టేకుల్‌కోడ్ గ్రామానికి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీంతో తహసీల్దార్ ముందు బైండోవర్ చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.

నట్టల నివారణ మందులు తప్పనిసరి

జిల్లా పశువైద్యాధికారి అనిల్‌కుమార్



నట్టల నివారణ మందు వేస్తున్న అనిల్‌కుమార్

దోమ: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తప్పక వేయించాలని జిల్లా పశువైద్యాధికారి అనిల్‌కుమార్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో 480 గొర్రెలు, 230 మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలలో ఏలికపాములు, బద్దెపురుగులు తదితర అంతరపరాన్న జీవుల వల్ల కాపరులు నష్టపోతున్నారన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడీ అంకమరాజు, ఏఓ ప్రహ్లాద్, పరిగి, దోమ మండల పశువైద్యాధికారులు రామకృష్ణ, ఆనంద్, సర్పంచ్ సురేశ్, ఎంపీటీసీ రాములు, సిబ్బంది బాబయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డుపై నడుస్తున్న గుర్తు తెలియని వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రామకృష్ణ ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున మంచాల మండల కేంద్రానికి చెందిన చందు తన ద్విచక్ర వాహనంపై ఇబ్రహీంపట్నం నుంచి మంచాలకు వెళ్తున్నాడు. ఆర్‌కేడీయా సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి(55) అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న చందు తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ టీపీ వైవీ ఉపాధ్యక్షుడిగా ముస్తఫా

ఇబ్రహీంపట్నం రూరల్: వైఎస్సార్ టీపీ యువజన విభా గం(వైఎస్సార్ టీపీ వైవీ) జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నంకు చెందిన మహ్మద్ ముస్తఫా నియమితులయ్యారు. బుధవారం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎడమ మోహన్‌రెడ్డి, గడ్డం హిందుజారెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముస్తఫా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

పెయింటర్ అదృశ్యం

పహాడీషరీఫ్: పెయింటర్ అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అజయ్ తెలిపిన ప్రకారం.. యూపీకి చెందిన రహీష్ అహ్మద్(29), రుబీనా ఐదు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కాగా వీరు రెండు నెలల క్రితం ఉపాధి కోసం ఇమాంగూడకు తరలివచ్చారు. పెయింటర్ పని చేసే అహ్మద్ రోజు మాదిరిగానే ఈ నెల 21న తుమ్మలూరు గేట్ వద్దకు వెళ్లాడు. రాత్రైనా తిరిగి రాకపోవడంతో ఆందోళనతో ఫోన్ చేయగా స్విచ్చాఫ్ చేసి ఉంది. దీంతో అతడి భార్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని, 94906 17241 నెంబర్‌లో గాని సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

బైక్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: నిరుద్యోగ యువతకు బైక్ రిపేరింగ్‌లో ఉచితం శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముచ్చింతల్ సమీపంలో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో అటల్జీ వృత్తి నైపుణ్య శిక్షణ సంస్థ, హీరో మోటాకార్ప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి హీరో మోటోకార్ప్ సర్వీసు కేంద్రంలో ఉద్యోగావకాశం కల్పిస్తామన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్ల వయసు గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆన్‌లైన్‌లోనే ‘ఉపాధి’ హాజరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల హాజరును ఇక ఎన్ఎంఎంఎస్ ద్వారా నమోదు చేయనున్నారు. కూలీల నమోదులో పారదర్శకత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపట్టింది. కానీ సిగ్నల్ సమస్యల కారణంగా ఫీల్డ్ అసిస్టెంట్లు ఇబ్బంది పడుతున్నారు.

- అక్రమాలకు చెక్ పెట్టేందుకు ‘ఎన్ఎంఎంఎస్’
- ఫొటోలు అప్‌లోడ్ చేస్తేనే వేతనం
- ఇబ్బంది పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు



పని ప్రదేశంలో కూలీల ఫొటో తీస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

పరిగి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపట్టింది. ప్రత్యేకంగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) మొబైల్ యాప్‌ను రూపొందించి కూలీల హాజరును ఆన్‌లైన్ చేసి అక్రమాలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. పని స్థలాల్లో హాజరైన కూలీల ఫొటోలను రోజువారీగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించింది. ఫొటోలో ఉన్న కూలీలకు మస్టర్‌లో హాజరు పడి వేతనం అందనుంది. కానీ సిగ్నల్ సమస్యల కారణంగా ఫొటోలు అప్‌లోడ్ చేయలేక పోతున్నామని ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. కూలీల హాజరును యాప్‌లోనూ, మస్టర్‌లో మ్యాన్‌వల్‌గానూ నమోదు చేయడంతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. వారంలో బుధవారం నుంచి శనివారం వరకు డిమాండ్ అందిస్తుండగా సోమవారం నుంచి పని చేయాల్సిన కూలీల మస్టర్ రావాల్సిన కూలీలు పనులకు హాజరుకాక ఇబ్బంది పడుతున్నారు.

కేంద్రం ఆధీనంలో పర్యవేక్షణ

ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఉపాధి పనుల పర్యవేక్షణ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లింది. దీంతో

జిల్లా పరిధిలోని వివరాలు	
కూలీల సంఖ్య:	3,71,043
యాక్టివ్ కూలీల సంఖ్య:	2,47,361
జాబ్ కార్డుల సంఖ్య:	1,85,708

కూలీలు 100రోజుల వరకే పనులు చేయాల్సి ఉంటుంది. వ్యవసాయ పనులు మినహాయిస్తే పేద కుటుంబాలను ఏడాది పొడవునా ఉపాధిహామీ పథకం ఆదుకోనుంది. గ్రామాల్లో ప్రధానంగా రైతులకు ప్రయోజనాన్ని కల్పించే పూడికతీత పనులు, గుంతలు, చెట్లు నాటే పనులు, మట్టి తీత, హరితహారంలో మొక్కలు నాటేందుకు గుంతలతీత తదితర పనులకు కూలీలు హాజరవుతున్నారు.

20 పనులకే పరిమితి

ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా గతంలో 20మంది కంటే ఎక్కువ కూలీలు హాజరైతేనే ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారు. ప్రస్తుతం సంఖ్యతో పని లేకుండా ఒక్క కూలీ హాజరైనా యాప్‌లోనే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పని ప్రదేశాల్లో పనులను ప్రారంభించే ముందు పనులు పూర్తైన తరువాత రెండు ఫొటోలు తీసుకుని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందంటున్నారు. గతంలో ఉపాధి హామీలో గ్రామానికి ఏడాదిలో 40పైగా పనులను చేపట్టే అవకాశం ఉండగా ఇప్పుడు దాదాపుగా 20 పనుల వరకే పరిమితి చేసింది.

సిగ్నల్ లేకుండా హాజరు ఎలా..?

సిగ్నల్ లేని ప్రాంతాల్లో యాప్ ద్వారా హాజరు నమోదు చేసే ప్రక్రియ సాధ్యమవ్వడం లేదు. జిల్లాలో చాలా గ్రామ పంచాయతీలు మారుమూల ప్రాంతాల్లోనే ఉన్నాయి. సిగ్నల్స్ లేకుండా ఆన్‌లైన్ హాజరు ఎలా సాధ్యమని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. కాగా ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఒకే చోట కాకుండా పంచాయతీ పరిధిలో వేర్వేరు చోట్ల పనులను కల్పించడం, ఒకొక్కక్కరికి రెండు మూడు గ్రామాల బాధ్యతలు అప్పజెప్పడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఏర్పడే ప్రమాదముందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతి ఉంటే మినహాయింపు

ఉపాధి కూలీలు పనిచేసిన ఫొటోలను తప్పకుండా ఎన్ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇప్పటి వరకు ఏ గ్రామంలోనూ సిగ్నల్ లేదనే ఫిర్యాదులు రాలేదు. సిగ్నల్ సమస్యలు ఉన్న గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు కలెక్టర్ అనుమతి తీసుకుంటే మినహాయింపు ఉంటుంది.

– కృష్ణన్, పీడీ, డీఆర్‌డీఓ

ప్రేమించిన వ్యక్తి మోసం

యువతి బలవన్మరణం

అనంతగిరి: ప్రేమించిన వ్యక్తి మోసం చేశాడని మనస్తాపంతో ఓ యువతి పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. వికారాబాద్ పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ మండలం గొట్టిముక్కుల గ్రామానికి చెందిన సీహెచ్.శిరీష(21) డిగ్రీ చదువుతోంది. ఆమె రెండేళ్లుగా గ్రామానికి చెందిన మహేశ్‌తో ప్రేమలో ఉంది. ఇటీవల ఆమె తనను వివాహం చేసుకోవాలని కోరడంతో యువకుడు నిరాకరించాడు. ఇదే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జనవరిలో మహేశ్‌ను రిమాండ్‌కు తరలించారు. ప్రేమించిన వ్యక్తి మోసం చేశాడని మనస్తాపం చెందిన శిరీష ఈ నెల 14న వికారాబాద్‌లోని ఎస్ఏపీ కళాశాల ఆవరణలో పురుగు మంది తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఆమెను చికిత్స నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ నెల 18న ఆమె పరిస్థితి విషమించడంతో నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాధితురాలు బుధవారం మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ టి.శీను తెలిపారు.

సేవాలాల్ జీవితం స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి బెల్లయ్య నాయక్, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: సేవాలాల్ జీవితం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి బెల్లయ్య నాయక్, డీసీసీ అధ్యక్షుడు, పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కుల్కచర్ల, చౌడాపూర్ గ్రామాల్లో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజన ప్రజల ఉన్నతికి, వారి సంస్కృతిని పరిరక్షించేందుకు సేవాలాల్ చేసిన గొప్పదన్నారు. గిరిజనుల ఉన్నతికి నాడు కాంగ్రెస్ ఎంతో కృషి చేసిందన్నారు. నాడు ఇందిరమ్మ ఇళ్లు అందించడం, రైతుల పొలాల్లో బోర్లు వేయించడం వంటి రైతు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటుగా గిరిజన ఆవాసాలు అభివృద్ధి చెందేందుకు ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం గిరిజన ప్రజల మధ్య కొట్లాటపెట్టి వారి హక్కులను కాలరాయడంతోనే సరిపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లంబాడ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గోపాల్ నాయక్, కాంగ్రెస్ కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు, చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, నాయకులు గోవింద్ నాయక్, బాలాజీ, రాజేందర్, గాంగ్యనాయక్, నర్సింహనాయక్, శివరాం, విఠల్ నాయక్, మీసేవ భరత్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆర్టిజన్ కార్మికుల ధర్నా

అనంతగిరి: ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్–82 నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం వికారాబాద్‌లోని ఎస్ఈ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగులకు, ఆర్టిజన్‌లకు పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. న్యాయమైన 29 డిమాండ్‌లను వెంటనే నెరవేర్చాలన్నారు. ఆర్టిజన్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. 2022 ఏప్రిల్ నుంచి ఇచ్చే పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలన్నారు. కార్మికులు ఐదేళ్లుగా ఎటువంటి ప్రమోషన్లు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్‌లో నలుగురు ఆపరేటర్లకు బదులుగా ఇద్దరు, ముగ్గురితోనే వెళ్లదీస్తున్నారని దీంతో పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. తమ సమసల్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జమీల్, జైపాల్‌రెడ్డి, సుభాన్, సంతోశ్‌నర్సింలు, గఫార్, ఆంజనేయులు, గౌరి శంకర్, హమీద్, వెంకటేశ్, జాఫర్, యాదగిరి, లాలు, కిషన్, కొండల్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంను ఢీకొట్టిన బస్సు

- డ్రైవర్, కండక్టర్, 9మంది ప్రయాణికులకు గాయాలు
- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన పోలీసులు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు

నందిగామ: డ్రైవర్ నిర్లక్ష్యం వలన బస్సు ప్రమాదం జరిగింది. ఈ ఘటన మండల కేంద్రంలోని బైపాస్ రహదారి మేకగూడ చౌరస్తా వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి వనపర్తికి వెళ్తోంది. ఈ క్రమంలో నందిగామ శివారులోని మేకగూడ చౌరస్తా వద్దకు రాగానే బ్రేక్‌ఫాస్ట్ లోడ్‌తో ముందు వెళ్తున్న డీసీఎంను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ రఘు వర్ధన్‌రెడ్డి, కండక్టర్ నారాయణ, ప్రయాణికులు శ్రీనివాస్‌రెడ్డి, నారమ్మ, దావూద్, నూర్జహాన్, మహ్మద్‌గౌస్, ఎల్లమ్మ, కృష్ణ, డీసీఎంలో ఉన్న కార్మికులు సోను చౌదరి, ప్రదీప్ చౌదరి గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలికి చేరకుని క్షతగాత్రులను షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. డీసీఎం యజమాని జింకల చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రామయ్య తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ..

అబ్దుల్లాపూర్‌మెట్: బైక్‌ను లారీ ఢీకొట్టడంతో బైకిస్టు మృతి చెందాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గోర్లపాటు తండాకు చెందిన తేజావత్ సాయికుమార్ (23) దిల్‌సుఖ్‌నగర్‌లో నివాసముంటున్నాడు. తన బైక్‌పై చౌటుప్పల్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్నాడు. అబ్దుల్లాపూర్‌మెట్ కూడలి వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో సాయికుమార్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉపాధి కల్పన భేష్



రవికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

మాడ్గుల: స్వయం ఉపాధి పొందుతూ మరికొంత మందికి ఉపాధి కల్పించడం అభినందనీయమని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇర్విన్ గ్రామంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, రైతు సమితి మండల అధ్యక్షుడు నూతనంగా నిర్మించిన శ్రీ శుభం గార్డెన్ బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవిని పలువురు అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీ సింగ్, కొల్కులపల్లి ఎంపీటీసీ సభ్యుడు కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, నాయకులు కొండల్‌రెడ్డి, విష్ణు, జంగయ్యయాదవ్, వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణకు అవగాహన కల్పించండి

ఎస్పీ కోటిరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

మర్పల్లి: మండల పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని పోలీసులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని అవగాహన కల్పించాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని కొత్లాపూర్, కోట్‌మర్పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు డీఎస్పీ సత్యనారాయణ, సీఐ వెంకటేశం, ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రభాకర్, విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. అనంతరం మర్పల్లి పీఎస్‌లో ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడారు. మండల పరిధిలో గ్రామాల్లో 212 కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ, సర్పంచ్‌లు, దాతల సహకారంతో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించిన సర్పంచ్‌లను, దాతలను ఎస్పీ సన్మానించారు. ఈ సందర్భంగా మర్పల్లి జెడ్పీటీసీ మధుకర్‌తో పాటు ఆయా పార్టీలకు చెందిన ఖలీమొద్దీన్, శేకర్ యాదవ్, మల్లయ్య, రాచన్న శ్రీనివాస్, మధుకర్, సంతోశ్,పూర్యనాయక్, రాజు, రఫియొద్దీన్‌తో పాటు పలువురు నాయకులు ఎస్పీ కోటిరెడ్డికి సన్మానం చేశారు.

మొక్కలు నాటి సంరక్షించండి

ప్రతీ ఒక్కరు తమ పుట్టిన రోజున తప్పక ఒక మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. బుధవారం మర్పల్లి పీఎస్‌లో సీసీ కెమెరాలు ప్రారంభించారు. అనంతరం మొక్క నాటి శాంతి కపోతాలను వదిలారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ వెంకటేశం, ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, మర్పల్లి ఉప సర్పంచ్ రాజు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శివగంగ రాజరాజేశ్వరాలయం హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న పాలకమండలి సభ్యులు

మహేశ్వరం: మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయ ఆవరణలో బుధవారం అధికారులు, పాలకవర్గం సమక్షంలో హుండీ లెక్కించారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రూ.3,32,963 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ మురళీ కృష్ణ, ఆలయ చైర్మన్ సుధీర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు చంద్రయ్య, యాదమ్మ, బాల్‌రాజ్, మహేందర్, రవీందర్, వెంకటేశ్, ఆలయ పూజారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులైన టీచర్లను సస్పెండ్ చేయండి

ఏబీజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్ నాయక్



మాట్లాడుతున్న శ్రీనివాస్ నాయక్

యాలాల: బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటనలో బాధ్యులైన టీచర్లను వెంటనే సస్పెండ్ చేయాలని అఖిల భారత గిరిజన సమాఖ్య(ఏబీజీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ గోవిందమ్మతో కలిసి తండాలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పిక్నిక్ నుంచి క్షేమంగా ఇంటికి చేర్చాల్సిన ఉపాధ్యాయులు, పూర్తిగా నిర్లక్ష్యం వహించారన్నారు. ఇంటికి చేర్చే సమయంలో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ విషయమై డీఈఓ రేణుకాదేవి, డీఎస్పీ, ఆర్డీఓతో ఫోన్‌లో మాట్లాడారు. పాఠశాల హెచ్ఎంపై మాత్రం సస్పెన్షన్ విధించి చేతులు దులుపుకోవడం తగదన్నారు. ఘటనకు కారణమైన మిగిలిన టీచర్లను సైతం వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడి కుటుంబ సభ్యుల నుంచి బాధజిత కుటుంబానికి భద్రత కల్పించాలన్నారు. పరామర్శించిన వారిలో ఆరూరు వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, గిరిజన సమాఖ్య యూత్ అధ్యక్షుడు భాను పవార్, రమ్యానాయక్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

పరిగి: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యాలాల మండలం పెర్కంపల్లి తండాకు చెందిన పదో తరగతి బాలికపై సర్పంచ్ తమ్ముడు రఘుపతి, ప్రధానోపాధ్యాయుడు, క్లాస్ టీచర్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అత్యాచారానికి పాల్పడిన రఘుపతికి ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, అనిల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జియో అటెండెన్స్ తప్పనిసరి

- లేదంటే వేతనంలో కోత తప్పదు
- పీహెచ్‌సీల్లో నెలకు 10 ప్రసవాలు జరగాలి
- మాత శిశు మరణాలు తగ్గాలి
- జిల్లా మలేరియా, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి సాయిబాబు



పెద్దేముల్ పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న సాయిబాబు

పెద్దేముల్: ‘జీతాలు సక్రమంగా రావాలంటే జియో అటెండెన్స్ తప్పని సరిగా ఉండాలి. మాత మరణాలు తగ్గాలి. పీహెచ్‌సీలో నెలకు 10 ప్రసవాలు కచ్చితంగా జరగాలి. నెలకు 18 రోజుల పాటు సూపర్‌వైజర్లు ఫీల్డ్‌లో ఉండాలి. ఏఎన్ఎం, ఆశల వద్ద గర్భిణులకు సంబంధించిన పూర్తి వివరాలు ఉండాలి’ అని జిల్లా మలేరియా, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి సాయిబాబు అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు విధులు సక్రమంగా నిర్వహించాలని, డీఈఓ ఉన్న చోట ఎలాంటి ఫైల్స్ పెండింగ్‌లో ఉండవద్దని చెప్పారు. క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని పీహెచ్‌సీ డాక్టర్ బుచ్చిబాబుకు ఆయన సూచించారు. సిబ్బందిపై ఆరాతీస్తూ ఎవరైనా సెలవులో ఉన్నారా? సిబ్బంది ఎన్ని గంటలకు విధులకు వస్తున్నారు. ఎప్పుడు వెళ్తున్నారని ప్రశ్నించారు. కొత్త కలెక్టర్ నారాయణరెడ్డి వచ్చిన తరువాత జియో అటెండెన్స్ అమలవుతుందని, ప్రతి ఒక్కరు తప్పకుండా సమయానికి హాజరు కావాలని చెప్పారు. ఎవరైన ఆలస్యంగా వస్తే వారికి జీతాల్లో కోత విధించబడుతుందని హెచ్చరించారు. మండలంలోని 37 జీపీల్లో 641 మంది గర్భిణులు ఉన్నారని, వారి పూర్తి వివరాలు ఏఎన్ఎం, ఆశ వర్కర్లు వద్ద ఉండేలా చుడాలని సూపర్‌వైజర్లుకు ఆదేశించారు. ఎల్ఎంటీ రిజిష్టర్ తప్పకుండా అమలయ్యేలా చుడాలని సూచించారు. ప్రతి నెల పీహెచ్‌సీలల్లో పదికి తగ్గకుండా ప్రసవాలు జరిగేలా చూడాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరగకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

మాతా మరణాలు తగ్గాలి

వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటుల్లో ఉండి, మాతశిశు మరణాలు తగ్గించేలా చూడాలని చెప్పారు. బీపీ, రక్తహీనత వల్లనే ఎక్కుల మరణాలు జరుగుతున్నాయని తెలిపారు. విధి నిర్వాహణలో ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా అధికారితో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి బుచ్చిబాబు, పీహెచ్ఎన్ అరుణ కుమారి, సూపర్‌వైజర్ పుష్పలత సిబ్బంది తదితరులు ఉన్నారు.